క్లుప్తంగా

నేడు మంత్రి సురేష్ పెద్దదోర్నాల పర్యటన

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించే వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొననున్నట్లు ఏపీఎం దర్శనం పోలయ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రూపులకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి కోరారు.

నేడు అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

మార్కాపురం టౌన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని అరుణాచలం పుణ్యక్షేత్రానికి మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. ఈ బస్సు ఈ నెల 4వ తేదీ రాత్రి 10 గంటలకు మార్కాపురంలో బయలుదేరి మళ్లీ 7వ తేదీ ఉదయం మార్కాపురం చేరుతుందని, చార్జీ రూ.2500గా నిర్ణయించామని పేర్కొన్నారు. ప్రయాణంలో కాణిపాకం, వేలూరు, కంచి, తిరుత్తణి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చని వివరించారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి

యర్రగొండపాలెం: బీసీలందరూ ఐక్యంగా ఉండి రాజ్యాధికారంవైపు అడుగులు వేయాలని బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు యాపర్తి వీరయ్య అన్నారు. సోమవారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆ సంఘ నియోజకవర్గస్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు బట్టపోతుల వెంకటేశ్వర్లు, ఎన్.కొండయ్య, ఎస్.శ్రీనివాస్, డి.బాలయ్య, బి.కాశయ్య, తోట ఈశ్వరమ్మ, ఆదినారాయణమ్మ, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు చేయూత చెక్‌ల పంపిణీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండలాల్లోని లబ్ధిదారుల మహిళలకు వైఎస్సార్ ఆసరా చేయూత చెక్కులను స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

తాళ్లూరు: తాళ్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులను అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీఓ సీహెచ్ భారతి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో దర్శి మండలం వెంకటాచలం పల్లి (ఓసీ) సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, తాళ్లూరు మండలం దోసకాయలపాడులో ఆయా (ఎస్సీ), ముండ్లమూరు మండలం పోలవరం-2లో ఆయా (ఎస్సీ) పోస్టులకు దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత రిజర్వేషన్ కేటగిరి వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 17 సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు పౌష్టికాహారం

ముండ్లమూరు: మండలంలోని మారెళ్లలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అరటి పండ్లు, తినుబండారాలు, పెరుగు సరఫరా చేయనున్నట్లు మాజీ సర్పంచ్ సుంకర ఇందిరాబ్రహ్మారెడ్డి కుమారుడు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పరీక్షల సందర్భంగా సోమవారం నుంచి విద్యార్థులకు పౌష్టికాహారం అందించనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ గోపనబోయిన శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలికుంటు నిర్మూలనే లక్ష్యం

కురిచేడు: గాలికుంటు వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ డి.నాగభూషణబాబు పేర్కొన్నారు. గత నెల 25వ తేదీ నుండి ఈ నెల 24వ తేదీ వరకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. దేశంలో గాలికుంటు వ్యాధి పూర్తిస్థాయిలో లేకుండా కనుమరుగైపోయే వరకు టీకాల కార్యక్రమం ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 11 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 3 నెలలు నిండిన తెల్ల పశువులు, నల్లజాతి పశువులకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు.

సీఐని సత్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు


సీఐతో వైఎస్సార్ సీపీ నాయకులు

పొదిలి: పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కేవీ రాఘవేంద్రను సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కల్లం వెంకట సుబ్బారెడ్డి, మండల మాజీ కన్వీనర్ జి.శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ జి.రమణారెడ్డి, భూమా రమేష్, కొత్తూరి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.


మార్కాపురంలో పరీక్ష కేంద్రానికి చేరుకున్న పదో తరగతి విద్యార్థులు


దర్శి: పరీక్ష కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి


గిద్దలూరు: విద్యార్థినులను పరీక్ష కేంద్రం బయట తనిఖీ చేస్తున్న హెచ్‌ఎం

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

మార్కాపురం టౌన్: పట్టణంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో 8 కేంద్రాల్లో, రూరల్‌లో 2 కేంద్రాల్లో పరీక్షలకు 1599 మందికిగాను 1581 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను సీఐ భీమానాయక్ తనిఖీ చేసి, ఎస్సైలు సుమన్, శశికుమార్‌కు పలు సూచనలిచ్చారు.

యర్రగొండపాలెం: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. యర్రగొండపాలెంలో ఏర్పాటు చేసిన నాలుగు సెంటర్లలో మొత్తం 809 మంది విద్యార్థులకుగానూ 802 మంది పరీక్షలకు హాజరయ్యారని ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై జి.కోటయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పుల్లలచెరువు: మండలంలో పదో తరగతి పరీక్షలకు మొదటి రోజు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో శామ్యూల్‌జాన్ తెలిపారు. మండలంలో మొత్తం మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరుగుతుండగా, 429 మందికిగానూ 426 మంది హాజరయ్యారని తెలిపారు. పీవీ పల్లి, పుల్లలచెరువు జెడ్పీ కేంద్రాలను తహసీల్దార్ దాసు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. స్క్వాడ్ అధికారి చంద్రశేఖరరావు కేంద్రాలను తనిఖీ చేశారు.

త్రిపురాంతకంలో ఐదుగురు గైర్హాజరు

త్రిపురాంతకం: మండలంలోని ఐదు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించగా, 705 మంది విద్యార్థులకుగానూ 700 మంది హాజరైనట్లు ఎంఈవో కె.తులసిమల్లికార్జున నాయక్ తెలిపారు. త్రిపురాంతకం జెడ్పీ హైస్కూల్‌లో ఒకరు, కేజీబీవీలో ముగ్గురు, దూపాడు ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌లో ఒకరు హాజరుకాలేదని తెలిపారు.

పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

దర్శి: పదో తరగతి పరీక్షలు దర్శిలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 7 సెంటర్లలో నిర్వహించిన పరీక్షల్లో 1390 మంది విద్యార్థులకు 1379 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించారు.

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల, గొట్లగట్టు, మర్రిపాలెం జెడ్పీ హైస్కూళ్లు, వెలుగొండ గురుకుల పాఠశాల కేంద్రాల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మర్రిపాలెంలో ముగ్గురు, గొట్లగట్టులో ఒకరు, వెలుగొండలో ఒకరు గైర్హాజరయ్యారని ఎంఈఓ డాంగే షరీఫ్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై దీపిక ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏ, బీ సెంటర్లు, కస్తూరిబా గురుకుల పాఠశాలలో మరో సెంటర్‌లో నిర్వహించిన 10వ తరగతి పరీక్షలు మొదటి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 482 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 478 మంది హాజరైనట్లు విద్యాశాఖాధికారి ఎస్.సాంబశివరావు తెలిపారు. పరీక్ష కేంద్రాల చీఫ్‌లు వీవీ రామాంజనేయులు, ఖాదర్‌మస్తాన్, రమణయ్యల పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయి. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ సైదుబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముండ్లమూరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఎల్.సంపత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభం సందర్భంగా పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులను పరిశీలించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లేందుకు అనుమతి లేకపోవడంతో వారిని చెక్ చేశారు. తెలుగు పరీక్షకు 460 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 458 మంది హాజరైనట్లు చీఫ్ ఎగ్జామినర్‌లు తెలిపారు.

తాళ్లూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 869 మందికి 860 మంది హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి జి.సుబ్బయ్య తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల, బేస్తవారిపేట జెడ్పీ బాలుర, బాలికల హైస్కూల్లో సోమవారం తెలుగు పరీక్షకు 515 మందికి 510 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు తెలిపారు. పిటికాయగుళ్ల హైస్కూల్లో జరుగుతున్న పరీక్షలను ఎంఈఓ తనిఖీ చేశారు. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలను ఎస్‌ఐ మాధవరావు పర్యవేక్షించారు.

కంభం: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 7 పరీక్ష కేంద్రాలు కేటాయించారు. వాసవీ విద్యానికేతన్‌లో 215 మంది విద్యార్థులకు 213 మంది హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 140 మందికి 140 మంది, ఆల్ఫా స్కూల్లో 160 మందికి 160 మంది, సీఎల్ఆర్ స్కూల్లో 158 మందికి 158 మంది, రంగరాజు స్కూల్లో 158 మందికి 158 మంది, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 117 మందికి 117 మంది, తురిమెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 150 మందికి 148 మంది హాజరయ్యారు. మొత్తం 1098 మందికి 1094 మంది హాజరై నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

అర్ధవీడు (కంభం): మండలంలో పదో తరగతి పరీక్షలకు 3 పరీక్ష కేంద్రాలు కేటాయించారు. అర్ధవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 180 మందికి 180 మంది హాజరయ్యారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో 99 మందికి 99 మంది హాజరయ్యారు. యాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 165 మందికి 163 మంది హాజరయ్యారు. మొత్తం 444 మంది విద్యార్థులకు 442 మంది హాజరై ఇద్దరు గైర్హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు తెలిపారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం పకడ్బందీగా నిర్వహించారు. ఎంఈఓ నరసింహారావు పర్యవేక్షణలో గిద్దలూరు మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్‌పాల్స్ ఏ, సెంటర్, సెయింట్‌పాల్స్ బి సెంటర్, ఎస్‌వీజేఆర్ కాలేజీ, ముండ్లపాడు గంజి భద్రయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సూర్య స్కూల్, మొత్తం 7 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. మొదటి తెలుగు పరీక్షకు మొత్తం 1339 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1322 మంది హాజరయ్యారు. 17 మంది గైర్హాజరయ్యారు.

ప్రతిష్టాత్మకంగా చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సబ్ కలెక్టర్ సేథు మాధవన్


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సేథు మాధవన్

మార్కాపురం: శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ సేథు మాధవన్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ నెల 5 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే వేలాది మంది భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ నెల 15న రథోత్సవానికి సంబంధించి ఆయా శాఖల అధికారులందరూ ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. చైర్మన్ కేశవరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నరసింహులు, సీఐ భీమా నాయక్, పట్టణ ఎస్సై శశికుమార్, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

రేపు కృత్రిమ అవయవాల శిబిరం


మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

మార్కాపురం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో బుధవారం వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరం నిర్వహించనున్నట్లు ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు డి.గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం పూల సుబ్బయ్య కాలనీలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. విరికొ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్ టెక్నీషియన్లతో క్యాంప్‌కు వచ్చే వారి కాళ్లు, చేతుల కొలతలు తీసుకుని, ఆ తర్వాత జైపూర్ కృత్రిమ అవయవాలు అందిస్తామని వివరించారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు సదరమ్ సర్టిఫికేట్, ఆధార్, రేషన్‌కార్డు, వైకల్యంతో ఉన్న నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న దివ్యాంగులకు ఎమ్మెల్యే కేపీ సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి సహకారంతో భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బ్లైండ్ అసోసియేషన్ నాయకులు బోయపాటి రామయ్య, మార్కాపురం పట్టణ, రూరల్ అధ్యక్షులు రమణారెడ్డి, శేఖర్, రెహమాన్, అశోక్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వన్ ర్యాంక్, వన్ పెన్షన్‌పై మాజీ సైనికుల ర్యాలీ

మార్కాపురం టౌన్: మాజీ సైనికులకు వన్ ర్యాంక్, వన్ పెన్షన్ విధానంలో మార్పును కోరుతూ సోమవారం జై జవాన్ మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ సేథు మాధవన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు శీలం హరినారాయణ రెడ్డి, వి.శేషసాయి మాట్లాడుతూ.. గత 43 రోజుల నుంచి దేశ రాజధాని ఢిల్లీలో మాజీ సైనికుల దీక్షలకు మద్దతుగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. దివ్యాంగుల పెన్షన్ అందరికీ సమానంగా ఇవ్వాలని, వితంతు పెన్షన్ కూడా పెంచాలని కోరారు.


ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు


ట్రాక్టర్, పనిముట్లు అందజేస్తున్న ఎంపీపీ, ఏడీఏ

తర్లుపాడు: డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద మండలంలోని కేతగుడిపి, పోతలపాడు ఆర్బీకేల్లో రైతు గ్రూపులకు రాయితీపై ట్రాక్టర్, వివిధ వ్యవసాయ పనిముట్లను ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి సోమవారం అందజేశారు. కేతగుడిపికి చెందిన కేదారనాదేశ్వర రైతు మిత్ర గ్రూప్ గ్రూప్‌కు ప్రభుత్వ రాయితీ రూ.4,95,600 పోను పీడీసీసీ బ్యాంక్ ద్వారా రూ.7,45,236 రుణం, పోతలపాడు శ్రీ శ్రీనివాస రైతు మిత్ర గ్రూప్‌కు ప్రభుత్వ రాయితీ రూ.5,18,880 పోను మార్కాపురం పీడీసీసీ బ్యాంక్ నుంచి రూ.7,11,350 రుణం మంజూరు చేసినట్లు ఏడీఏ ఆర్.రమాదేవి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్, సర్పంచ్‌లు శ్రీనివాసరెడ్డి, పెద్ద మస్తాన్, రైతులు మల్లారెడ్డి, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల నిరసన


ధర్నా చేస్తున్న నాయీబ్రాహ్మణులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో న్యూఢిల్లీ ప్రాంతానికి చెందిన వ్యక్తులు బార్బర్ షాపులు పెట్టి తమ జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని స్థానిక నాయీబ్రాహ్మణులు సోమవారం ధర్నా నిర్వహించి, ప్రదర్శనగా వెళ్లి సబ్ కలెక్టర్ సేథు మాధవన్‌కు వినతి పత్రం ఇచ్చారు. నాయీబ్రాహ్మణ సేవా సమితి సభ్యులు, ప్రతినిధులు రమేష్, రామయ్య తదితరులు మాట్లాడుతూ.. తమ కుల వృత్తి ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోవడంతో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. క్షౌర వృత్తిలోకి ఢిల్లీ, యూపీ చెందిన కార్పొరేట్ సంస్థలు ప్రవేశించినప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

పరిశుభ్రత పాటించాలి

పుల్లలచెరువు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తారని ఎంపీడీవో రాజ్యలక్ష్మి అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఇళ్లలోని చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. ప్లాస్టిక్ వాడటం వలన వచ్చే అనర్థాలను వివరించారు. తడి, పొడి చెత్తను వేరు వేరు డబ్బాల్లో వేసి పంచాయతీ వారికి సహకరించాలన్నారు.

రీజియన్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా డేవిడ్ హారిసన్

దర్శి: పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్షునిగా పందుల డేవిడ్ హారిసన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండపంలో సోమవారం నియోజకవర్గ కమిటీ ఎన్నిక వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గాలిముూటి దేవప్రసాద్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కేసనపల్లి నాగేశ్వరరావు, బుర్రె సాంసన్‌ల ఆధ్వర్యంలో జరిగింది. కార్యదర్శిగా శ్రీరామ్ ఏసుబాబు, జాయింట్ సెక్రటరీగా వై.ఆశీర్వాదం, ట్రెజరర్‌గా పి.సాల్మన్, కార్యవర్గ సభ్యులు పరదేశీ, ఇశ్రాయేలు, మోహన్‌రావు, లింగయ్య ముఖ్య సలహాదారులుగా జి. ఏసుదాసు, పాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మార్కాపురం: స్థానిక జిల్లా వైద్యశాల వద్ద సోమవారం సుమారు 60 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రూరల్ ఎస్సై సుమన్ తెలిపారు. మృతుడి శరీరంపై ఎర్రటి పట్టు పంచా, ఎర్ర చొక్కా ఉన్నాయని, ఆచూకీ తెలిసిన వారు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కాగా మృతుడిని సాధువుగా భావిస్తున్నారు.

ఆక్రమణలో ప్రభుత్వ భూమి


చదును చేసిన భూమి

దొనకొండ: మండలంలోని బాదాపురం రెవెన్యూ సర్వే నంబర్ 216లోని సుమారు 4 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది చదును చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కొంతమంది తహసీల్దార్ కాలే వెంకటేశ్వరరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాల ఎదురుగా ప్రభుత్వ సంస్థలకు ఉపయోగపడే విలువైన భూమిపై కొంత మంది కన్ను వేశారు. భూమి చదును చేసి అమ్ముకోవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. గ్రామానికి నడిబొడ్డులా ఉండే ఈ ప్రభుత్వ భూమి చాలా విలువైందని, ఆ స్థలంలో జరుగుతున్న పనులను ఆపి ఆక్రమించుకునే వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు విన్నవించారు. స్పందించిన తహసీల్దార్ వెంకటేశ్వరరావు విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఘనంగా విజయాంజనేయస్వామి తిరునాళ్ల


అలంకరణలో విజయాంజనేయ స్వామి

దొనకొండ: స్థానిక అడ్డరోడ్డులో పాపులమ్మ బావి వద్ద వెలసిన శ్రీ విజయాంజనేయస్వామి తిరునాళ్లను భక్తులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయం విద్యుత్ దీపాలతో ముస్తాబైంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఏటా శ్రీరామ నవమి వెళ్లిన 4వ రోజు జరుపుకుంటున్నట్లు ఆలయ ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి తెలిపారు. దాతల సహకారంతో భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

చెన్నకేశవాలయానికి భారీగా తలనీలాల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

మార్కాపురం టౌన్: శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి తలనీలాల ఆదాయం గత ఏడాది కంటే రూ.6 లక్షలు అదనంగా సమకూరింది. ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను ఏడాదిపాటు పోగు చేసుకునే హక్కును సోమవారం నిర్వహించిన వేలంలో టెండర్‌దారులు రూ.13.51 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే హక్కుకు రూ.7.50 లక్షలు మాత్రమే ఆదాయం వచ్చింది. వేలాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పి.కేశవరావు, ఈఓ జి.శ్రీనివాసరెడ్డి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

తిరునాళ్ల ప్రశాంతంగా జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న దర్శి సీఐ రామకోటయ్య

తాళ్లూరు: గుంటి గంగ తిరునాళ్లను ఈ నెల 8న నిర్వహించనున్న నేపథ్యంలో ప్రభల నిర్వాహకులు ప్రశాంతంగా జరుపుకుని సహకరించాలని దర్శి సీఐ రామకోటయ్య కోరారు. గుంటి గంగా భవాని ఆలయం వద్ద సోమవారం ప్రభల నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన దర్శి సీఐ మాట్లాడుతూ ప్రభల ఏర్పాటు చేసే నిర్వాహకులు ప్రభల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకుని నిర్ణీత సమయంలో ముగించాలని చెప్పారు. దేవస్థానం వద్ద తీసుకుంటున్న జాగ్రత్తలు, ట్రాఫిక్ నియంత్రణపై జాగ్రత్తల గురించి వివరించారు. ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్, గుంటి గంగా భవాని ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడిగా పురుషోత్తం


నియామకపత్రం అందుకుంటున్న పురుషోత్తం

బేస్తవారిపేట: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల అధ్యక్షుడిగా బేస్తవారిపేటకు చెందిన తేజో పురుషోత్తం నియమితులయ్యారు. ఒంగోలులో జరిగిన సమావేశంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ టి. భానుచందర్, సాంస్కృతిక కో ఆర్డినేటర్ డాక్టర్ టి.రవీంద్ర, రాష్ట్ర మహిళ సెల్ అధ్యక్షురాలు ఎం.శశికళ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీకాంత్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ పదవి వచ్చేందుకు సహకరించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా, స్టేట్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.